# వశిష్ట

## శివల జగన్నాథరావు



"ఈ కథకి బహుమతి రాదు" అన్నాడు నా మిత్రుడు శేషశయనం.

"ఏం?" అన్నాన్నేను ఆశ్చర్యకంఠంతో.

"ఇందులో మంచి వస్తువు లేదు. మసాలాలు లేవు. ఫ్లాష్ లేదు."

"మరేం వుందంటావ్?" అడిగాను కొంచెం కోపంతో.

"ఏదో వుంది. అదేమిటో సరిగ్గా బైటపెట్టడం లేదు నువ్వు! చెప్పాల్సింది సరిగ్గా చెప్పలేకపోతున్నావు. ఈ కథని నీ మిత్రుడు రమేష్‌కి చూపించు! ఆ తర్వాత పోటీకి పంపించు."

"ఆయన ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరకడు! అందుకని నేనే నా పాట్లేవో పడతా." అని చెప్పి, కథ తీసుకున్నాను. నాకు వీలయిన రకంగా మార్చేను. ఆపైన అది పల్లకి ఎక్కితే ఎక్కుతుంది లేకపోతే దిగుతుంది అనుకున్నాను.

* * *

సముద్రం హోరుమంటూ ఘోషిస్తోంది. కెరటాలు నిలువెత్తున ఎగిరి పడుతున్నాయి. చల్లటిగాలి సముద్రం నుంచి వస్తూ ఒంటిని గిలిగింతలు పెడుతోంటే, చుట్టూ రకరకాల మనుషులు, రంగు రంగుల మనుషులు సందడి చేస్తోంటే ఎంత హాయి హాయిగా వుందీ ఎప్పుడూ ఇక్కడే వుండిపోతే ఎంత బావుంటుందీ! అనుకున్నాడు వశిష్ట.

అతడి ఒంటికి ముప్ఫయ్యేళ్ళ వయసుంది.

అతడి ముఖం మీద ముప్ఫయి మూడు మడతలు వున్నాయి. అతడి జుత్తు అప్పుడే అరవయి ఏళ్ళని సూచిస్తూ చాలా భాగం తెల్లబడిపోయింది.

అతను చాలా చాలా అర్భకంగా, ఒంట్లో శేరు మాంసం, సోలెడు రక్తం లేని వాళ్ళా వున్నాడు.

చారల చొక్కా, నల్ల పంట్లామూ వేసుకుని వున్నాడతను.

పాదాలకి చెప్పులు లేవు.

ఒక్క మాటలో- అతడు దరిద్రానికి, దైన్యానికి ప్రతిరూపంలా వున్నాడు.

ఆ వూర్లో సముద్రం వున్నది. దానంత కష్టం, దానంత పరితాపం వున్న వాళ్ళెందరికో, అది గొప్ప రిలీఫ్! వశిష్ట ఎప్పుడైనా వారానికో, రెండు వారాలకోమారు బీచ్ కెళ్తాడు. అక్కడ అందాల్ని అవుపాశన పట్టి సంతృప్తుడౌతాడు.

వశిష్ట ఇల్లు వాళ్ళ సొంతం కాదు.

పుట్టేసరికే నాన్న పోయీ, అమ్మని మిగిల్చేడు వశిష్టకి.

వశిష్ట తల్లి కాదంబరి వంటలు చేస్తోంది. వంటలు వండుతూ తోటి వంటవాడైన చిట్టిని పెళ్ళి చేసుకుంది. చిట్టి కాదంబరి కొడుకుని చిరాగ్గా చూశాడు. "వీడు ఎందుకు మన మధ్య?" అన్నాడు.

"అలా అంటే నువ్వు నాకు వద్దు" అంది కాదంబరి.

కాదంబరి సూది ముక్కు మీద ప్రేమతో, ఆమె నిండు గుండెల మీద మమకారంతో చిట్టి, వశిష్టని సహించాడు. కాదంబరి ఎదురుగా వశిష్టని కన్నెత్తి చూడకపోయినా, ఆమె

లేనప్పుడు వాడిని కాలెత్తి జాడించేవాడు. ఆ విధంగా పెరిగాడు వశిష్ట.

అందరికీ ఎన్నో వండి వార్చే అమ్మ, నాన్న వశిష్ట కంచంలో వట్టి చారూ, అన్నం మాత్రం అమర్చడం, ఆ కుర్రాడి మనసు మీద 'ఈ పాడు బతుకు ఈలాగే గడవాలి కాబోలు' అనే స్టాంపు వేసేసింది.

చిట్టి కాదంబరి వయసుని, యవ్వనాన్ని తాగేశాడు.

బ్రాండీ, విస్కీలు తాగాడు.

ఇంట్లో నదరుగా ఉన్నవస్తువులన్నీ అమ్మేసీ తాగాడు.

వశిష్ట గుండెలో మంట మండుతోంది.

తల్లిని 'ఇంకా ఆ అయిదియ్యి, నాల్గియ్యి'' అంటూ చిట్టి జుట్టు లాగి, తంతూంటే, వెళ్ళి చావగొట్టాలనిపించింది. ఓసారి అలా కొడితే చిట్టి వశిష్టని కాలితో తన్నాడు. గుండె మీద బలంగా ఆ తాపు తగిలి బాధతో విలవిల్లాడాడు వశిష్ట.

అలాంటప్పుడే సముద్రాన్ని ఆశ్రయించేడతను.

అలా ఎన్నో మార్లు....

ఆ ఇల్లు కూలిపోతే బావుణ్ణు.

చిట్టి వండుతూ ఆ పొయ్యిలో పడి ఛస్తే బావుణ్ణు.

కలల్లో అలా వచ్చేవి.

ఓ రోజు తల్లి, చిట్టి దవుర్జన్యానికి బలి అయిపోయింది. వాడి తన్నులికి చచ్చి వూర్కుంది.

వశిష్ట తల్లి చనిపోగానే, చిట్టిలో మార్పొచ్చింది. మంచం దిగలేని స్థితిలో వుండిపోయాడు.

వశిష్ట చిట్టికి పరిచర్యలేం చేయలేదు. వాడినలా విడిచిపెట్టి, తన దారి తను చూసుకున్నాడు. చదువు పెద్దగా లేదు తనకి. ఆ దరిద్రపు బతుకులో, ఆ చీదరలో ఏదో తొమ్మిది దాకా చదివేడంతే.

* * *

వశిష్ట ఒక పెద్ద కిరాణా షాపులో పనికి కుదిరేడు, నెలకేదో ఇంత ఆదాయం వస్తోంది. కడుపు కింత తిండి దొరుకుతోంది. జీవితం మరీ చేదుగానూ లేదు మరీ తీయగానూ లేదు.

ఈ సంధి బ్రతుకులో ఒక ఆశాదీపం రమణి

రమణి ఎర్రగా, ఏపుగా వుంటుంది.

ఆమెకి పెద్ద డాబా ఇల్లుంది. ఇల్లంతా అద్దెలొస్తాయి. ఒక వాటాలో ఒక్కతే వుంటోన్న రమణి వశిష్ట మీద మోజుపడింది. పిల్చి మాట్లాడింది. వశిష్ట ఆశ్చర్యపోయాడెంతో.

రమణికి నలభయి ఏళ్ళు!

తనకి పాతిక!

తనని పెళ్ళి చేసుకోమనడుగుతోందేమిటి?

''ఏం ఫర్వాలా'' అన్నాది రమణి.

రమణి కథ కూడా ఎంతో కొంత విపరీతమైనదే. ఆమె తల్లి, రమణికి జ్ఞానం తెలిసేసరికి, లెక్కపెట్టలేనంత మంది మగాళ్ళకి 'భార్య' అయిందని, రమణికి తెల్సింది. భయపడింది, బాధపడింది.

''నువ్వూ అంతే' చెప్పింది తల్లి.

అంతే. రమణి తను పెద్దమనిషయిన్నాడు, తన మీద పడిన పెద్దమనిషిని చావగొట్టి పంపింది. ఆ రాత్రే తల్లి పీక నులిపి చంపింది. పోలీసులొస్తే నోట్లతో నోళ్ళు మూసింది. అప్పట్నించీ అలా విరక్తిగా వుండిపోయింది. రోజు జరగకపోదు! ఇల్లు తనది అద్దెలు తనవి!

మగాళ్ళని కనిపెట్టి అసహ్యించుకునే రమణి–

వశిష్టని కనిపెట్టి అసహ్యించుకోలేదు.

అతను రావాలని తాపత్రాయపడింది.

రెండు చేతులతో చుట్టి, కవుగిట్లో పొదువుకొంటే, తనేనాడూ–ఎరగని ఆ స్పర్శ–మెత్తగా, వెచ్చగా, సుఖంగా, హాయిగా అన్పించి అతడలా వుండిపోయి, ఇంత స్వర్గంలోంచి ఎందుకు వెళ్ళాలి? ఒద్దు ఒద్దనుకున్నాడు.

రమణీయ స్వర్గంలో విశిష్ట ఆరుమాసాలపాటు మునిగితేలాడు.

వశిష్ట షాపు యజమానికో కుమార్తె వున్నది. పేరు భరిణి, రూపం కూడా చక్కనిదే. అదృష్టం ఒక్కటే ఆమెది చక్కటిది కాదన్న సంగతి, ఆలశ్యంగా తెలిసింది వశిష్టకి.

యజమాని వశిష్టతో తన కూతుర్ని పెళ్ళి చేసుకోమని కోరేడు. దైలమాలో పడ్డాడు వశిష్ట, ఎలా? భరిణి రమణి కంటే చిన్నది. తనకీడుజోడుగా వుంది సరేమో, రమణి ఒప్పుకోదే? ఎలా?

నాలుగు రోజులు అటూ ఇటూ అయ్యేడతను.

ఆ పోనిద్దూ. రమణితో తనకి లోకం ఏమిటి?

రమణికి ఏం జరక్కపోదులే!

యజమానికి మాటిచ్చేసేడు.

పెళ్లిమంటూ పెళ్ళయిపోయింది.

అందరూ అక్షింతలు వేసి ఆశీర్వదించితే—

రమణి తిట్లతో ఆశీర్వదించింది, వశిష్టని.

ఓ వంక, ఆ తిట్లకి బాధ కలిగినా, మింగి, భరిణెని చూస్తూ భరించేడు.

ఆ రాత్రి–భరిణెనే వశిష్ట బాహువుల్లో బంధించబోతే—

''ఛీ'' అని విదిలించుకొన్నదామె.

''నీకు సిగ్గూ లజ్జా లేదూ? నేనాడపిల్లని గదా? నన్ను పట్టుకుంటావా? నా బట్టలిప్పమంటావా? ఛీ ఛీ''

''నువ్వు నా పెళ్లానివి.''

''చంపుతాను జాగర్త!''

''ఎందుకు ఒప్పుకున్నావో పెళ్ళికి?''

''నాన్నే నా నోరుమూసేడు.''

''నీకు పిచ్చా? వెర్రా?''

కర్రతో అతన్ని కొట్టబోతే, ఎలాగో వదిలించుకుని ఇవతలికి వచ్చేసేడతను.

తనన్ని విధాలా వంచింపబడ్డాడు తన షాపు యజమాని దాచేడు కూతురి పిచ్చిని!! చాలా మంది దాచేరు!!

అతనేడ్చుకున్నాడు. ఎంతో సేపు.

* * *

సముద్రం పెద్ద గొంతుతో పిలుస్తూన్నట్లుంది.

''రా రారా. నీకేం ఫర్వాలేదు. అందరూ నిన్ను అన్యాయం చేసినా నీకు నేనున్నాను. రా! నా ఒడిలో సేద తీరు.''

వశిష్ట అడుగులు కదులుతూ వున్నాయి ఇసుకలో.

నీళ్ళల్లోంచీ, కెరటాల్లోంచీ వెళ్తున్నాడు అతను.

ఎవరో ఇద్దరు కేకలు వేస్తూ వచ్చి, మీద పడ్డారు. లాక్కుపోయి, ఒడ్డున పడేశారు.

చచ్చే వాడికి చావడానికూడా వీలులేదా అన్నాడతను.

''లేదు'' అంది లోకం. ●

